**కథ**

# పోదాం... పద!

**వీరాజీ**

**''ఏది తప్పినా ఏది తప్పకపోయినా - ఆదివారం నాడీ రేవు తప్పదు కదా'' కోడలు సరళ వాషింగ్ మెషీన్ మూతతీస్తూ ''వొరేయ్ నాన్నా! డుంబూ... తాతయ్యగారి చొక్కాలేవైనా ఉంటే ఇవ్వమన్రా, మీ గ్రాండ్ మానీ...'' అంటూ కేకేసింది.**

అత్తగారు సుమిత్ర వంటింట్లో పీలర్‌తో బీరకాయకి నార తీస్తూ ''రాజుగారూ పెయ్యిని కట్టించండీ అన్నట్లు - మళ్లీ దానికి నానమ్మ ఎందుకూ? వాళ్ల తాతయ్య బట్టలు వాడే తెస్తాడు. ఒరేయ్, బంగారు తండ్రీ! తాతయ్య గదిలోకెళ్లి...'' అంటూండగానే - తరుణ్ అలియాస్ డుంబుగాడు - ''ఇవిగో గ్రాండ్ పా ప్యాంటూ, షర్టూ, మఫ్లరూ-'' అంటూ, అక్కడ అవి పడేసి పారిపోబోతూ ''అరె!'' అని వెనక్కి తిరిగి, తాతయ్య ప్యాంటు బ్యాక్ పాకెట్‌లో నుంచి రెండు కాగితం ముక్కలు రంగువి.. తీశాడు.

సరళ కుతూహలం ఆపుకోలేక ఆ రంగు కాయితం ముక్కల్ని చటుక్కున అందుకొని - ''భలే! మీ తాతయ్యగారు నిన్న ఆఫీసుకి డుమ్మా కొట్టి సినమాకి చెక్కేసేర్రోయ్...'' అంది. అవి రెండూ డ్రస్ సర్కిల్, మ్యాటినీ టిక్కెట్ ముక్కలు. ఆమె చేసిన శల్య పరీక్షలో ఆ రెండూ శనివారం మధ్యాహ్నం టైటానిక్ సినిమా మ్యాట్నీ షోవి అని కూడా కనిపెట్టేసింది! అలా సినిమా థియేటర్ పేరుని బట్టి అందులో ఆడుతున్న సినిమా పేరు చెప్పలేకపోతే - యీ కాలం వర్కింగ్ గాళ్ సరళకెంతో ఇన్‌సల్ట్ కదా!

సుమిత్రకి పీలర్ చేతిలో నిలబడలేదు. ఆమెకు చిరుచెమటలు పోశాయన్న సంగతి నాలుగుమీటర్ల దూరం నుండి కనిపెట్టిన కోడలు- అత్తయ్యవేపు వేళాకోళంగా చూస్తూ- ''మీరు మామయ్యగారిని అదుపులో పెట్టడం లేదు సుమండీ!'' అంది.

సుమిత్ర కూరల తట్ట అట్లాగే వదిలేసి వచ్చి, కోడలి చేతిలో నుంచి ఆమె వాషింగ్ మెషీన్‌లో వేస్తున్న గుడ్డలు లాగేసుకొని వాటితో పాటే, టికెట్ ముక్కలు కూడా తీసేసుకుంది.

''నేను వేస్తాలే అమ్మా! నువ్వు ఆనక డ్రయర్‌లో వేద్దువుగాని. అబ్బాయికేంగావాలో చూడు'' అంటూ, కోడల్ని అక్కణ్నుంచి తోలేసింది.

ఆ రెండు టిక్కెట్ ముక్కల్ని ఆమె గప్‌చిప్‌న తన జాకెట్‌లో దాచేసుకోడం డుంబుగాడు చూడలేదు గాని వాళ్లమ్మకి తలవెనక కూడా కళ్లుంటాయ్. సరళ కనిపెట్టేసింది మరి.

బూట్‌పాలిష్ చేసుకుంటూ డుంబుగాణ్ని 'కాకా' పట్టి కార్టూన్ ఛానల్‌ని మ్యూజిక్ ఏషియాకి మార్చుకుని చూస్తున్న రాజేష - భార్య తెచ్చి ఇచ్చిన కాఫీ చప్పరిస్తూ - ''నువ్వుగానీ రుచి చూసి ఇచ్చావా? ఇంత తియ్యగా ఉందీ!'' అన్నాడు.

''మీ డాడీ మార్నింగ్ వాక్ నుంచి ఇంకా రాలేదా?'' అంటూ, అతని సరసాన్ని ఇంత పిసరు పట్టించుకోకుండా - సరళ ఆ రెండు టిక్కెట్ ముక్కల మిస్టరీ గురించి తన థియరీ చెప్పింది. నిన్న మధ్యాహ్నం మీ అకవుం'టెం'ట్ డాడీగారు స్టైనో వాసంతితో చెక్కేశారు, సార్!'' అంది.

''ఛప్! రెండో టిక్కెట్ ముక్క మీద 'వాసంతి' అని రాసుందా?'' అన్నాడు రాజేష.

రాజేష అన్నాడు ''అసలే ఆ ఇద్దరూ ఇరవై నాలుగ్గంటలూ వాదులాడుకుంటూనే ఉంటారు. ఇక నువ్విప్పుడు , ఆ ఇద్దరి మధ్యా అగ్గిపుల్ల గీసి పడేస్తున్నావన్నమాట!''

ఒక బూటు ఆమె వైపు తోసి, ''ఇది పాలిష్ చేస్తున్నట్లు నటించు. అమ్మ ఇటే చూస్తోంది. నేను నీకో షాక్ ఇస్తాను విను'' అన్నాడు.

నిజంగానే సరళ భర్త చెప్పింది విని షాక్ అయిపోయింది! తన డాడీ రంగధామయ్యగారు శనివారం మధ్యాహ్నం థియేటర్‌లో ఒకావిడ పక్కన కూర్చొని సినిమా చూశాడు. చూశాడనటానికి వీల్లేదుట! ఈ 'ఆరా' తీసిన రాజేష ఫ్రెండు గిరీశం ఆమెను దగ్గరసా చూడలేదుట! బాగోదు కదా!

తీరా సినిమా అయ్యేసరికి ఈ జంట మాయం అయిపోయిందట!

సరళ - ''టూ ప్లస్ టూ ఈజీక్వల్ టు ఫోర్,'' అంది, నవ్వుతూ.

''కాదు'' అన్నాడు డుంబు. ''టూ టూ జార్ ఫోర్'' అన్నాడు.

''వీడొకడు - పానకంలో పుడకలాగ'' అని, ఆ మొగుడూ పెళ్లాలు ఇద్దరూ వాణ్ని ఒకేసారి అందుకొని, గట్టిగా ముద్దెట్టేసుకున్నారు.

★ ★ ★

ఆ మధ్యాహ్నం రంగధామ్, సుమిత్రా దంపతులు వో కునుకు తీసేవేళ - పిల్లల్లా పోట్లాడుకున్నారు. అసలీ మధ్య ఆ ఇద్దరి మధ్యా, ఎప్పుడూ ఏదో ఒకదానికి వాదులాటే.

మార్నింగ్ వాక్‌కి వెళ్లే ముందు బెడ్‌కాఫీ ఇవ్వలేదనీ ఒక రోజూ, ఇస్తే అయిష్టంగా ఇచ్చావని మరో రోజు, ఇచ్చిన దాన్ని అలా వదిలేసి, పోట్లాడిపోవడం మరో రోజు యిలా. అయితే, ఆ రోజు మాత్రం - 'మ్యాట్నీ షో' మీదే కలహించుకున్నారని సరళా, రాజేష్‌లు అనుకున్నారు.

''అయినా మా డాడీ పబ్లిక్‌గా చెప్పి, ఫస్ట్ షోకి వెళ్తే పోలా? అఫ్‌కోర్స్.. పాయింటది కాదు. అమ్మా - పాపం! ఎడ్యుకేటెడ్ అయినా, అమాయకురాలు. నాన్నగారి పక్కన నిన్న కూర్చున్నావిడకి తల నిండా - భుజాల దాకా వ్రేలాడుతూ - మల్లెపూల చెండు ఉందిట - యీ సంగతి తనకి తెలిస్తే, ఇంకా ధుఃఖపడుతుంది మా అమ్మ '' అన్నాడు రాజేష.

సరళ సహజంగానే 'గాసిప్ ఎక్స్‌పర్ట్' అని వాళ్ల ఆఫీసులో అంతా అంటారు. భర్తని బుగ్గమీద పొడిచి మరీ చెప్పింది.

''మీ అమ్మగారు కూడా శనివారం మధ్యాహ్నం ఇంట్లో లేరు. తాళాలు పక్కనిచ్చి, మహిళామండలిలో 'మెడిటేషన్ సెషన్' అని చెప్పి వెళ్లిపోయారుట. ఆవిడొచ్చే దాకా డుంబుగాడు స్కూలు నుంచి వచ్చేక ప్రక్కింటి గుండుగాడితో గోలీలాడేసుకున్నాడు. ''ఛీ... నా దుఃఖం ఎవరికి చెప్పుకోను? అసలూ మనం ఇద్దరం ఉద్యోగాలు చేయడమే తప్పు'' అంటూ, నెత్తిమీది కుండ వొలకబోసింది సరళ.

''అమ్మకి వీడంటే ప్రాణమే. ఏమాటకామాటే చెప్పుకోవాలి. అదే పెద్దాయనకి మంట. మొగుడు అన్న వాణ్ని నెగ్లెక్ట్ చేస్తే ఎలా చెప్పూ?'' తల్లిని వెనకేసుకొచ్చాడు. తప్పదు. ఎందుకంటే తనను ఎలా పెంచిందో, తన చెల్లి సౌభాగ్యనెలా పెంచిందో అంతకన్నా 'యిది'గా డుంబుగాడి కోసం అమ్మ అంకితం అయిపోయింది!

కోడలు ఆ సాయంకాలం అత్తగారి మీద ఎనలేని జాలి, ప్రేమా వొలకబోసింది. ఎంతయినా,



తోటి ఆడది కదా! ఆమె జాగాలో తానుంటేనా? ''మామగారిని వాషింగ్ మెషీన్‌లో పడేసేదాన్ని'' అనుకుంది కానీ, ఇప్పుడు ఇద్దర్నీ కలుపకూడదు. తనకీ, తన బిడ్డ డుంబుకీ అన్యాయం అయిపోతుంది. ఆమె ఉంది కనుక రాజేష్, తనూ ఆఫీసులు వదిలేక షైర్‌లకీ, షికార్లకీ, ఆదివారాలు ఫ్రెండ్స్‌తో పిక్‌నిక్లకీ - యిలా, అలా చెక్కేస్తున్నారు. ఇంటికి రాంగానే ఫిల్టర్ కాఫీ, పకోడీలు రెడీ! అమ్మో! తాతయ్యగారు పది రోజులు - తన ఆడబడుచు సౌభాగ్య పురిటికెళ్తేనే అటు మామగారితోనూ, ఇటు డుంబుగాడితోనూ వేగలేకపోయింది.

సరిగ్గా ఇదే బాధ రంగధామయ్యకి కూడా! పిల్లలు పెద్దాళ్లయ్యే దాకా - వాళ్లతోనే ప్రపంచం అంది. వాళ్ల పెళ్లైనాకా వాళ్ల పిల్లలతోనే ప్రపంచం అంటోంది సుమిత్ర. ఛీ! ఆడదాని ప్రపంచం ఎంత సంకుచితం? ఎంత చిన్నది? కోడలొచ్చాకా తాను యిలా ''రావోయ్ సుమూ '' అని పిలిస్తే కూడా ''యిష్షు! అమ్మాయి వింటుంది. ఆ చిటికెలేమిటి?'' అనేది. మనవడు పుట్టాక తన గదిలోకే రావడం మానేసింది. ప్రతీ దానికీ ''కోడలూ, కొడుకూ చూస్తారు'' అంటుంది. ''చూస్తే? ఏమిటిటా? వాలంటరీగా రిటైరై పోయి సన్నాసుల్లో కలిసిపోతాను'' అనుకున్నాడు రంగధామ్. కానీ, 'సుమూ'ని చూడకుండా ఎలా ఉండగల్డు?

వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుంటే హాయిగా ఇద్దరం వో పల్లెటూళ్లో కొండల నడుమ, నీలాకాశం క్రింద జలపాతం ప్రక్కని టీవీలు, సినిమాలు, మనుమలు, మనుమరాండ్రు, కొడుకు, పొరుగు సావిత్రమ్మలు, మహిళామండలి - గీతా బోధనలు గట్రా లేని మారుమూలకి పారిపోతే? కానీ. ''రాను పొమ్మంది'' సుమిత్ర. ఉత్తమొండి ఘటం.

డుంబుగాడు తాను పెడితేనే గానీ 'బువ్వ' తినడుట! రాజేష్‌కి సరళ వంట చేస్తే నాలికమీద వెంట్రుకలు మొలుస్తాయ్‌ట!

అలా సుమిత్రనే తలపోస్తూ, ఇంటికి వస్తూనే ఏమయ్యేవో ఆ మధురోహలన్నీ వాళ్లు మండించేసుకునే వాడు - అకవుంటెంట్ రంగధామ్.

★ ★ ★

అమ్మా నాన్నల కీచులాటలు చూస్తూంటే, రాజేష్‌కి ఒకోసారి పిచ్చెత్తిపోతుంది. వీళ్లిద్దర్నీ దూరంగా పెట్టేస్తే పోతోంది అనుకునేవాడు - తన పెళ్లాం దగ్గరసా లేనప్పుడు.

''కాగల కార్యం గంధర్వులే తీర్చారు'' అన్నట్లు సౌభాగ్య మొదట ఉత్తరం రాసింది. ఆనక ఫోన్ చేసింది. '' అమ్మని ఒక్క రెండు వారాలు పంపండొదినా! మా ఆడబడుచుకి ఎమ్మే పరీక్షలు! బాబిగాడు, బుజ్జమ్మ - ఇద్దర్నీ చూసుకోవడం నా వల్ల కావడం లేదూ...'' అని. అఫ్‌కోర్స్, అమ్మని చూడాలని కూడా ఉందిట!

సుమిత్రకి సంతోష సముద్రమే తన హృదయంలో దూరి ఘోషించినట్లయింది.

డుంబుగాడు బెంగెట్టుకుంటే ఫోన్ చెయ్యండి - వచ్చేస్తానంది - పెట్టె సర్దుకుని రెడీ అయిపోయి, రంగధామ్? ఇంకా ఎక్కడి రంగధామ్? రంగధామయ్య అనాలిట! సుమిత్ర తాను సమిత్రమ్మ అయిపోయి - తనను రంగధామయ్యను చేసేసింది. భర్త పక్కన కూచొని, దొంగతనంగా సినిమా చూడటంలో ఉన్న 'మజా' ఎంజాయ్ చెయ్యకుండా బిడియంతో గజంన్నర మల్లెచెండునీ కూడా, సినిమా హాలు డస్ట్‌బిన్‌లో పారేసి ఇంటికి పరిగెత్తిందానాడు. అతనికి ఆ రోజే ఒళ్లు ఉల్లీ మిరియం నూరి రాసుకున్నట్లు మండిపోయింది.

సుమిత్ర ఊరికి పోతూ, పోతూ డుంబుగాడికి రకరకాల లంచాలిచ్చి - తిరిగి వస్తున్నప్పుడు చాక్లెట్లూ, బిస్కెట్లూ, బొమ్మలూ తెస్తానని ప్రలోభపెట్టి మరీ వెళ్లిపోయింది. కోడలితో మాత్రం చెప్పింది, భర్త వినేలాగా...

ఆయనగారి బెడ్‌కాఫీ సంగతి మర్చిపోకమ్మా... లాకర్ తాళాలు పారేసుకొస్తారేమో - ఇంట్లోనే పెట్టమను.... ఇలాంటివే ఇంకా ఏవేవో చాలానే చెప్పింది.

రంగధామ్ అక్కడ ఉంటేగా... డుంబుగాణ్ని ఎత్తుకుని మరీ బీచ్‌కి వెళ్లిపోయాడు. ''పదరా నాన్నా! మనకి నేడే స్వతంత్ర దినం. లెటజ్ సెలబ్రేట్,'' అనుకుంటూ -

★ ★ ★

సౌభాగ్యనీ, పిల్లల్నీ చూసిన కొన్ని గంటలదాకా సుమిత్రకి మరేం జ్ఞాపకం లేవుగానీ మర్నాటి నుంచీ -'గిల్టీ'గా ఫీలవ్వటం మొదలెట్టింది! కాలం వెనక్కి వెళ్లదంటారు గానీ అది వెనక్కి వెళ్లే మాధ్యమం మనస్సే - సుమిత్రకి భర్త దూరం అయ్యేసరికి మనస్సు ఆరాటపడి- పాతికేళ్లు వెనక్కి వెనక్కి భలే పరుగెత్తింది. టెలిఫోన్ వేపు ఆశగా చూస్తూ, అక్కడే కూర్చునేది. భర్త ఫోన్ చేస్తాడేమో, తన గురించి బెంగపడుతున్నానని చెబుతాడేమో నన్నది ఒక వెర్రి ఆశ!

ఆ రోజులే వేరు!

ఇన్ని టెలిఫోన్ లెక్కడ? ఇన్ని సినిమా హాల్స్ ఎక్కడ? అయినా ఎలాగో- సంకేత, సందేశాలు అందుకొని, ఇంట్లో అబద్ధాలు చెప్పి రంగధామ్‌తో పారిపోయేది - సుమిత్ర! మ్యూజియమ్‌లు, సెంట్రల్ పార్కులు, సినిమా థియేటర్లు, ఎగ్జిబిషన్లు - దేనికి టిక్కెట్టుంటే దానికి హమేషా రెండు టిక్కెట్లు కొని అట్టేపెట్టేవాడు - పైలా పచ్చీస్ రంగధామ్.

ఒప్పులకుప్ప, ఒయ్యారి భామా - 'సుమూ' అలా పెళ్లికి ముందే - ఓ టిక్కెట్ ముక్కల ఖజానా సంపాదించింది. అవి ఇప్పటికీ పాతబీరువా లాకర్‌లో ఎక్కడో దాచింది. ఎలా ఉన్నాయో? తమ మధురస్మృతులకు అవే సాక్ష్యాలు!

సుమిత్రలో హఠాత్తుగా పడుచుదనం లేచి నేలతల్లిని మొలకెత్తే విత్తనం పొడుస్తున్నట్లు - పొడుస్తున్నది. రాత్రి నిద్దరపట్టలేదామెకు. పగలు పనిచేతబట్టడం లేదు.

పొద్దున్నే లేచి, బెడ్‌కాఫీ పెట్టేసిందోనాడు. కూతురు సౌభాగ్య ఇది చూసి నవ్వేసింది. ''మా ఆయన అస్సలు బెడ్ కాఫీనే తాగరు. మరిచిపోయేవా, అమ్మా?'' అంటూ.

అంతలో టెలిఫోన్ మోగింది! టక్కున తీసుకుని ''నేనేనండీ'' అంది, అప్రయత్నంగా. రంగధామ్ అవతల - ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడని - అతని కంఠంలోని తొట్రుపాటే చెబుతోంది. ''అయ్ కెనాట్ లివ్ వితౌట్ యూ - సుమూ '' అన్నాడు భర్త.

''హాయిగా ఎగిరిపోదాం, రాండి సార్! నాకు రెక్కలొచ్చాయ్'' అంది.

అంతలో, అల్లుడు లేచిన అలికిడి అయింది. ఫోన్ కట్ చేసింది. చేసే ముందు, తెలివిగా 'రేపు అయిదున్నర సార్'! అంది గడుసుగా.

అల్లుడు అడక్కుండానే ''రాంగ్ నెంబర్ బాబూ! పోయి పడుకోండి. ఇంకా ఆరు కాలేదు. నే లేస్తాగా!'' అంది సంజాయిషీ ఇస్తున్నట్లు.

ప్రేమ దొంగది! ప్రేమ దుస్సాహసుది! ప్రేమ అబద్ధాలాడుతుంది! మర్నాటిదాకా, ఒకటే ఆలోచనలు సుమిత్రకి.

★ ★ ★

అప్పటిదాకా జలజలా చిరుజల్లులు పడి వెలిశాయి. మధ్యాహ్నపుటెండ కాస్తా నీరెండ అయిపోయింది.

రంగధామ్ బ్రీఫ్‌కేసులో టోపీ గట్రా పెట్టుకొని దొరబాబులాగ ప్లాట్‌ఫాం మీదికి వస్తున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కి ఎదురు నడిచాడు.

అదుగో... అదుగో యస్.ఫోర్ బోగీ. కిటికీ దగ్గర దీపం వెలిగినట్లు సుమిత్ర మొహం కనపడ్డది - రంగధామ్‌కి! ఎదురేగి, ఆమె దగ్గర బ్యాగ్ అందుకున్నాడు.

''రావేమోనని భయపడ్డా'' నంటూ సుమిత్ర చెయ్యి అందుకుని దింపాడు.

'ధైర్యం కోసమా?' అన్నట్లు గుండెల మీద ఒక చెయ్యి వేసుకుని ''ఎవరేనా చూస్తారేమోనండీ'' అంది సుమిత్ర భర్త చెయ్యి వదలకుండానే.

''ఏయ్! మనిద్దరం వాళ్లందరి దృష్టిలో మొగుడూ, పెళ్లాలమే. మనవరకే, మనం లేచిపోతున్న ప్రేయసీ ప్రియులం. పద... ఇవిగో రెండు టిక్కెట్లు. డోంట్ కేర్... బి హ్యాపీ..''

ఆ రెండు టిక్కెట్లూ టక్కున అందుకుని ''థాంక్యూ సార్!'' అంది సుమూ.

అదే రైలు మళ్లీ ఆ ఇద్దర్నీ ఎక్కించుకుని ముందుకి సాగింది. కానీ, ఈసారి ఆ ఇద్దరూ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నా హాయిగా, స్వేచ్ఛగా ఎ.సి. కంపార్ట్‌మెంట్ ఛెయిర్ కార్‌లో కూర్చున్నారు.

''అమ్మాయితో వాళ్ల మైసూర్ అత్తయ్యగారింటికి వెళ్తాను అని చెప్పానండీ...కానీ, ఏమిటో నాకు భయంగా ఉందండీ.''

''కళ్లు మూసుకో. భయం పోతుంది. నేనూ అబ్బాయికదే చెప్పానులే'' అన్నాడు ఆమె మొహంలోకి అప్పుడే చూసినట్లు చూస్తూ.

ఏదో సాధించానన్న తృప్తితో రంగధామ్ భార్య భుజం మీదుగా చెయ్యి వేసి రెండో చేత్తో ఆమె ముంగురులు సవరించాడు.

'షి యీజ్ ఏన్ ఏంజిల్' అని మురిసిపోయాడు. అది రెండు మనసుల సంగమం.

''సార్! ఎక్కడికి మన ప్రయాణం?'' మగతగా అడిగింది 'సుమూ'. ఉలిక్కిపడి సర్దుకున్నాడు రంగధామ్.

ఆ కంపార్ట్‌మెంట్ కిటికీ తెరలు కొంచెం అసింటా జరిపాడు. ''అటు చూడు. చిటికెడు ఆకాశం. ఎంత స్నిగ్ధంగా, నీలంగా, హాయిగా - ఎలా ఫ్రీగా ఉందో చూడు. నువ్వూ, నేనూ - ఆ 'ఆకాశం' - ఆ ఆనందం, ఆ స్వేచ్ఛా.. అక్కడికే మనం...పద...పోదాం..'' అంటూ ఏదో పొయిట్రీ చెప్పేస్తున్నాడు ప్రియుడు - భర్త. ప్రేయసి సుమిత్ర మాట్లాడలేదు. రంగధామ్ కూడా టక్కున ఊరుకున్నాడు. మాట్లాడాలని లేదు. కనులు తాపీగా మూతపడ్డాయి.. తనువులక్కడే ఉన్నాయి కానీ, వాళ్ల మనసులా? అవి కొత్త రెక్కలొచ్చిన కోర్కెల్లా - స్వేచ్ఛగా, హాయిగా... ఎత్తుగా... ఎక్కడికో ఎగిరిపోతున్నాయి!

